**"ఇక యేం జరిగినా తనకు భయంలేదు. ఆశ్చర్యంలేదు, లక్ష్యంలేదు, అవసరమూలేదు, అనవసరమూ కాదు—అది అంతే! నథింగ్"**

# నథింగ్

కె.ఎస్.రమణ

చీకటి చీకటిగా వుంది గది. ఆకాశంలో చంద్రుడు నెమ్మదిగా పైకిపాకుతున్నాడు. కిటికీలోంచి వల్చగా వెన్నెల పరచుకుంటోంది. లోపలి గదిలోంచి కిలకిలలు వినిపించాయి. తల పగిలి పోతోంది అనుకుంటూ సోఫామీంచి పైకిలేచింది భారతి.

ఇదేదో వూబిలో యిరుక్కున్నట్లుంది మనసు—యెంత పైకి వద్దామని ప్రయత్నిస్తే అంత లోపలికి వెళ్ళి వూపిరాడనీకుండా—తనలో యింత బాధా కసీ విసుగూ కోపమూ అసహ్యమూ దాగివున్నాయా—తనలో యిన్ని అగ్నిపర్వతాలు పేలడానికి సిద్ధంగా వున్నాయా యిన్నాళ్ళూ—నుదుటిమీద చేతివేళ్ళతో పాముకుంటూ నిట్టూర్చింది.



నెమ్మదిగా నడిచి లైటువేసి అద్దం ముందు నుంచుని చెదిరిన జుత్తు సరిచేసుకుంటూ— ఫొటోలో నవ్వుతున్నాయి నిర్మలంగా నిష్కల్మషంగా అమాయకంగా అందంగా ఆ కళ్ళు— తనవే తను జన్మనిచ్చిన ప్రాణి- తన కంటికి రెప్పలా చూసుకున్న తన రక్తం పంచుకున్న జీవి- తనలాగే తను అరవిరుస్తున్న వయసులో ఎట్లా వుండేదో అట్లాగే- యిన్నాళ్ళకి తనని కోసుకున్న. తను యెంచుకున్న వ్యక్తితో జీవితం పంచుకుంటున్న మొదటి రాత్రిలో- ఫొటోని చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకుంది. లేదు లేదు తను సుఖంగా వుండాలి తనకి ఏ విషయమూ తెలీకూడదు— అట్లాగే పెంచింది తనని ఏ కష్టమూ తెలీనీకుండా- స్వచ్ఛంగా స్వేచ్ఛగా ధైర్యంగా నిజాయితీగా తనుగాలోకాన్ని చూడగల్గటం నేర్పింది, నడవగల్గటం నేర్పింది, నేర్పాననే తాననుకుంది. నేర్పినట్టే వినీల ప్రవర్తించేది. కాని వోరోజు ఉదయమే వో వ్యక్తితో వొచ్చి నేనూ ఆయనా పెళ్ళిచేసుకున్నాం అమ్మా అని ఆశీర్వాదం అడిగినప్పుడు మూగగా వుండిపోయిందేకాని మాట పెగలలేదు. దగ్గిరగా తీసుకుని హత్తుకుందేకాని కన్నీళ్ళు వెలికి రాలేదు— యీ గొంతు ముడి యెప్పుడో వీడుతుంది. యీ గుండె బరువు యెప్పుడో తగ్గుతుంది అని— యీ అస్తిత్వాన్ని తొలిసారిగా తొణికించిన వ్యక్తికోసం నిరీక్షణా భ్రమలో కాలం గడిపింది యిన్నాళ్ళూ— అది ముగిసింది— చల్లగా మంచులా కఠినంగా గడ్డకట్టుకుపోయింది హృదయం— వున్నట్లుండి ఆంతర్యాన్ని నిర్లిప్తతా శూన్యం ఆవరించింది— యిక యేం జరిగినా తనకు భయంలేదు ఆశ్చర్యంలేదు లక్ష్యంలేదు అవసరమూలేదు అనవసరమూకాదు— అది అంతే— నథింగ్— నథింగ్— తల విదల్చుకుని చీరు వాకేసి నడిచి తలుపుతీసి జిన్ బాటిల్ తీసుకుంది. చప్పుడుకాకుండా వంటింట్లోకి నడిచి నిమ్మకాయబెకోసి తీసుకుని కొన్ని జీడిపబెకుల్ని ప్లేటులో వేసికొని కాసినినీళ్ళు ఫ్రిజ్‌నుంచి తీసి గాజు కూజాలోకి వొంపుకుని వొచ్చి కూచుంది. జిన్ కలుపుకుని గ్లాసుని మెల్లగా పెదవులకి ఆనించుకుని కళ్ళు అరమూసి రెండు గుటక లేసింది.

ఇప్పుడు బావుంది. కొద్దిగా చల్లగా—

## "నెహ్రూ కూడా మెజీషియనే"

ఒకసారి నెహ్రూగారు జపాన్ పర్యటించినపుడు ఒక ధనికుడి ఇంట్లో డిన్నర్‌కి వెళ్ళారు. అక్కడ పాత్రలన్నీ వెండితో చేసినవి. చెంచాలు, ఫోర్కులు బంగారంతో చేసినవి ఉన్నాయి. నెహ్రూ అంతరంగిక బృందంలోని ఒక వ్యక్తి ఆ బంగారు చెంచాలనుచూసి ముచ్చటపడి రెండు చెంచాలను తీసుకుని తన జేబులో వేసుకున్నాడు. వంటకాలు రుచిగా ఉండటంవలన ఎవరూ ఇది గమనించలేదు చాచా నెహ్రూ తప్ప.



డిన్నరు తరువాత నెహ్రూ అందరినీ ఉద్దేశించి "లేడీస్ అండ్ జంటిల్మన్! మీ అందరికీ మాజిక్ ఇండియాలో ఆవిర్భవించిందని తెలుసుకదా! ప్రతీ భారతీయుడు అంతో ఇంతో ఇంద్రజాలం చేయగలడు. ఇపుడు నేనొక అంశం ప్రదర్శిస్తాను." అని చెప్పి రెండు బంగారు చెంచాలను తీసుకుని తన కోటు జేబులో ఉంచుకుని "హ్రాం హ్రీం— సోనేకా చెంచా చలే జావ్" అని ప్రేక్షకులతో అంతకుముందు చెంచాలు దొంగిలించిన వ్యక్తిని చూపించి తన మాజిక్ శక్తి ద్వారా తన జేబులోని చెంచాలను అతని జేబులోనికి రప్పించాను చూడమని అన్నారు. అతని జేబులో చూడగా రెండు చెంచాలున్నాయి. హాలంతా చప్పట్లతో దద్దరిల్లి పోయింది.

తన అంతరంగిక సహాయకుడు చేసిన దొంగతనం బయటపడకుండా, ఒక చమత్కారంచేసి ఆ చెంచాలను బయట పెట్టించిన నెహ్రూ కూడా మెజీషియనే మరి!

—దేవరాజు రవి

యెందుకో రామారావ్ గుర్తుకొస్తున్నాడు. ఆ రోగ్ యెక్కడున్నాడో యిప్పుడు యెక్కడుంటే తనకేమిటి. ఎలా వుంటే తనకేమిటి. మంగళసూత్రం తెంపి అతని చేతికిచ్చి పాపని తీసుకుని వొచ్చేస్తున్న దృశ్యం. అతని కళ్ళలో ఆశ్చర్యం. దెబ్బతిన్న అహం. కోపపు యెరుపు జీర గుర్తుకు వొచ్చాయి. ఆ లంజకి వుద్యోగంయెందుకు యిచ్చారు అని తన ప్రిన్సిపాల్‌తో వొచ్చి అసభ్యంగా తనముందే మాట్లాడం— తను కాలిచెప్పు తీసుకోవటం అదొక పెద్ద రభస కావటం గుర్తొచ్చింది. మొదట్లో నాగరికుడైన పశువు అనుకుందేకాని తరువాత బురదలో పందిలాగా కన్పించాడు. తనను ట్రాన్స్‌ఫర్ చేసిగాని నిద్రపోలేదు ఆ అసమర్థుడు—మరింకేం చేయలేకపోయాడు.

కొద్దిగా చెమటలు పోసినట్లనిపించి లేచి పంకా స్పీడు పెంచింది. రేడియో ట్యూన్ చేసింది. "దోస్త్ దోస్త్ నా రహా" అని ముఖేష్ కంఠం దిగులుగా బాధగా విషాదంగా, యేడుపు ఏడుపు వొంటరి ఏడుపు తనకెవ్వరూ లేరని. పుట్టినప్పుడు ఈ జగత్తులో అన్ని సంవేదనలతో స్పందించినపుడు తొలిసారిగా అస్తిత్వం చైతన్యంచినపుడు— నిజంగానా— యెప్పుడు— యెప్పుడూ— అప్పుడూ యిప్పుడూ ఒంటరే తనకుతానుగా తనకోసం బతికిన క్షణాలెన్ని— తనను కదిలించి కరిగించి— శతసహస్ర తంత్రుల అనుభూతి వీణని పలికించిందెప్పుడు— నథింగ్- నథింగ్ తనకన్నీ యెన్నో అనుభవంలేని అనుభూతులే మిగిలాయి. తన అణువణువూ స్వప్నించిన మమతచిప్పిలే మృదు మాధురీ పుష్పంలాంటి యౌవనకాలమంతా ఎడారిలో యింకిపోయింది. యిప్పుడు జాడలు మిగిలి తడి పొడిగా గొంతు ఎండినట్లనిపించి పెదిమల్ని నాలికతో తడుముకుని మరో గుక్క మింగింది.

నీకేం తక్కువని- నిన్ను నా ప్రాణమంతటితోనూ ప్రేమిస్తున్నాను. మనం యెక్కడైనా వెళ్ళిపోదాం. నా డబ్బులతో హాయిగా కాలం గడపొచ్చు అని సగం భయంగా సగం ధైర్యంగా తన భుజాలపై చేతులేసి వొణుకుతున్న పెదిమలతో చెప్పిన అమర్ మొహం చూస్తున్నప్పుడు యెప్పటికీ శాశ్వతంగా ఆ చేతులమధ్య యిమిడిపోతే అనిపించింది. కాని ఏదో గుర్తొచ్చి కళ్ళముందు నిలిచి అతనికోసం వొక్క క్షణం అతని పెదిమలను తన పెదిమెలతో తడిచేసి వొత్తి అదిమి గాఢంగా వొక్క క్షణమే ఆ కళ్ళలో వెలిగిన వెలుగూ, మొహంలో వుద్రిక్తత వల్ల వుబికిన రక్తం యెరుపూ, తనచుట్టూ వొణుకుతూ తడిమిన అతని చేతులూ, వెచ్చటి మంచుపొగ శరీరాన్ని ఆవరించినట్లు నరాల్లో సంచలనం యింకా తను జ్ఞాపకముంటుందా అతనికి. తను అంత కఠినంగా తిరస్కరించినందుకు గాయపడి వెళ్ళిపోయాడు. మళ్ళీ క్లాసులకి రాలేదు. కొన్నిరోజులకి టి. సి. తీసుకుని వెళ్ళిపోయినట్లు తెలిసింది. మళ్ళీ యెక్కడో చేరి వుంటాడు. చదువుకుని వుద్యోగంచేస్తూ అమ్మానాన్నలు యేరిన అమ్మాయిని పెళ్ళి చేసుకునుంటాడు. బుద్ధిగా— చిన్నగా నవ్వుకుంది. అవును అప్పుడు అతనిది కుర్రతనం అనుకుంది. కాని ఎంత పట్టుదల ఆ కుర్రాడికి. తన మనసు కరిగేలా చివరికి తను ఓడిపోయేలా—వుహూ.... అందుకే అతన్ని దూరంగా నెట్టివేసి తను గెల్చాననుకుంది. కానీ తనకి తెలుసు. ప్రతిసారీ వోడి పోతున్నది తనే అని తెలుసు. తానేమైపోవాలనుకుంటూ యేమైపోతున్నదీ తెలుసు. తనని లోబరచుకున్న బాధ్యత తన సహజ స్వభావంలోనిదే అని తెలుసు. సృష్టిలో స్త్రీకి యీ ప్రత్యేకత సమాజంలో యెలా బాధగా బరువుగా వొక్కోప్పుడు శృంఖలంగా పరిణమించిందో—మగవాడి నిష్కారణ ఆధిక్యానికి ఆలంబనంగా ఎలా తయారైందో తెలుసు. తనకితెలియందల్లా ఒకటే. యెందుకు యెందుకు తనలో యీ అవ్యక్త వ్యధ— నిర్భరతృష్ణ— అంతులేని ఆర్తి— తనని నిలవనీకుండా అందరిలా బతకనీకుండా— అలజడిగా అశాంతిగా యేమిటది—

తలుపు తెరుస్తున్న సవ్వడి— బాత్‌రూమ్‌లో నీళ్ళచప్పుడు విన్పించి టేబిల్ లైట్ ఆర్పేసింది భారతి. వినీల తనను పలకరించొచ్చు. యీ సమయంలో తను నిద్ర మేల్కోవటం వినీలకి కొత్తకాకపోయినా— వినీలను యిప్పుడు చూట్టం తనకు యిష్టంలేదు. వూపిరి బిగబట్టి నిరీక్షించింది— తలుపు గొళ్ళెంపెట్టిన సవ్వడి.

తనతో మాట మాత్రమైనా చెప్పకుండా వున్నట్లుండి మాయమైన నళిని మళ్ళీ ఎన్నేళ్ళకి ఎట్లా కనిపించాడు. నళిని—నళిని ఎంత మారిపోయాడు. వొళ్ళు చేశాడు. రంగు తేలాడు. మనిషి ఖరీదుగా వున్నాడు. తాజా ఆపిల్ పండులా వున్నాడు. డబ్బు ఆరోగ్యాన్నిస్తుంది గర్వాన్నిస్తుంది గౌరవాన్నిస్తుంది సుఖాన్నిస్తుంది. జారుకుంటున్న యౌవనాన్ని గడమాయించి మరీ నిలబెడుతుంది. విజ్ఞానమూ చాతుర్యము తోడైతే విశ్వాన్నే జయించేలా ప్రవర్తిస్తుంది. డబ్బే నీతి—డబ్బే విలువ— డబ్బే నాగరికత- ఆ డబ్బు పంజరంలోకి వినీల కూడా వెళ్ళిపోయింది చివరికి.

"నాకు నువ్వు కావాలి. అందుకే ఈ

పెళ్ళి చేసుకున్నాను. తెలిసే యిట్లా చేశాను. నేను ప్రేమించినప్పటి భారతి వినీలలోనే కనిపించింది." నన్ను క్షమిస్తావ్ కదూ"— నళినీ నళినీ నీకు కావలసింది నా ప్రేమ కాదు నా శరీరం— నా అందం- ఒకప్పుడు అందరిన్నీ పిచ్చెక్కించిన అందం_కాలేజీలో లెక్చరర్లను ప్రొఫెసర్లను కూడా మత్తెక్కించిన అందం— లైట్లు ఆరిపోయిన కాలేజీ ఫంక్షన్ రోజు హటాత్తుగా కలకలంలో తన్ని కావిలించుకుని గట్టిగా ముద్దెట్టుకున్న పెదిమలు. తను సవాలు చేసే సరికి తనేనంటూ ధైర్యంగా ముందుకొచ్చిన పెదిమెలు— నువ్వెంత అందంగా వున్నావు రతీ— నిన్ను విడిచి వుండలేక పోతున్నాను. నీ ప్రేమలో పిచ్చివాడినై పోతానేమో ననిపిస్తుంది అని చెవి దగ్గర మెల్లగా తాకుతూ మాటల్లో తేనెల్ని వొలికించిన పెదిమెలు యిప్పుడు—యిప్పుడు—యిక్కడే మరో గదిలో ఆలోచన భరించ లేక ఛీఛీ యేమైపోతోంది తను.

వినీల అచ్చు తనలావుంటుంది. కాకుంటే పిడికెడు ఎత్తు. వాళ్ళ నాన్న చాయ కొద్దిగా. కానీ బాగా ఎరుపేననిపిస్తుంది వొంటిరంగు జిన్ బాటిల్ పూర్తిగా వొంచింది ఆఖరి చుక్క వరకూ. నెమ్మదిగా గ్లాసు పూర్తిచేసి వొక జీడిపప్పు నోట్లో వేసుకుని పైకి లేచింది- కొద్దిగా మత్తుగా మసకగా అనిపించి పల్చటి వెన్నెల వెల్తురులో తడుము కుంటూ వెళ్ళి స్విచ్చినొక్కింది. ఫ్లోరసెంట్ కాంతి గదంతా తెల్లగా పరచుకుంది. కళ్ళు మండినట్లనిపించి గట్టిగామూసుకుని మెల్లిగా తెరిచి నిలువుటద్దం ముందుకి వెళ్ళి నించుంది.

తను యెందుకు బావులేదు— అవును మొహంలో మార్పులు వొచ్చాయి— కళ్ళ కింద లేత నీలిఛాయలు— వుదయపు యెండ పైబడుతున్నకొద్దీ కొద్దిగా నలిగినట్లున్న వాడినట్లున్న గులాబీమొహం— పైట తీసేసింది— పచ్చగా యెరుపుగా జాకిట్టుకీ చీర కుచ్చిళ్ళకీ మధ్య కొద్దిగా యెత్తుగా మెరుస్తూ నున్నటి పొట్ట— మరీ సన్నం కాకపోయినా లావుకాని నడుమూ— బిగుతు జాకెట్టులో కొద్దిగా వొంపుగా గుండ్రంగా వుబికిన స్తనాలు.... యేదో అలజడి అసహనం వొత్తిడి ఆవేశానికి లోనై జాకెట్టూ బాడీ విప్పేసింది— కుచ్చిళ్ళపైన చేయి వేసి అద్దంలోకి చూసింది. తెల్లగా విచ్చుకున్న కలువల్లా స్తనాలు కొద్దిగా బింకంసడలి తన వొంట్లో యౌవనం యింకా వుండదల్చుకోలేదు. మెల్లిగా జారుకుంటోంది. తాదాత్మ్యంచి విలీనించి తనత్తయించే క్షణాలు యింకా యింకా వున్నాయనుకుంటున్న తనకి భ్రమే మిగిలింది.

అష్టవిష్టమైన తమకుటుంబ పరిస్థితుల్ని చక్కదిద్దాలనుకునే గృహిణులు, బాగుపడాలనుకునే పురుషులు చదివి తీరవలసిన కుటుంబగాథ.....
శ్రీమతి మాలతీచందూర్
ఓ మనిషికథ ........ 16.00 రూ
ఇంకా.......మధ్యతరగతి కుటుంబాలలోని యీనాటి ఆడపిల్లల అవస్థలను అతినాజూకైన తన కథ కథనంతో తీర్చిదిద్దిన ........
ఒద్దెప్రాడి సుధారాణి
ప్రేమనేరమౌనా ........ 12.00 రూ
వాసంతి ........ 14.00 రూ
ప్రసిద్ధ హిందీ రచయిత
శ్రీ గుల్షన్ నందా
సాయంసంధ్య ...... 12.00 రూ
ఉత్తమ కన్నడ రచయిత
శ్రీ టి.బి. నవలలు
బ్రహ్మచారికొడుకు 11.00 రూ
వెండిలేఖలు ......... 13.00 రూ
అన్ని పుస్తకాల షాపులలోనూ దొరుకుతవి. లేదా ఒక రూపాయి తగ్గించి కావలసిన పుస్తకాలకు M.O పంపండి. ఆరు రూపాయికి V.P.P పంపుతాం.
క్వాలిటీ పబ్లిషర్స్ రామమందిరం వీధి విజయవాడ-2

## నిమ్మకాయ మంత్రం

**చే**తబడి, బాణామతి, చిల్లంగి, ప్రయోగం అనే వివిధ పేర్లతో వ్యవహరించబడే ఓ పెద్ద మూఢ నమ్మకం మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నాం. అక్కడ ఇప్పటికి సొసైటీలు, క్లబ్బులు వున్నాయి. మనదేశంలో నగరవాసులకు అంత నమ్మకం లేకపోయినా పల్లె ప్రజలలో మాత్రం వాటి పేరు చెప్తే హడల్. అది ఆసరాతీసుకుని కొందరు స్వార్థపరులు కొన్ని మాజిక్కులు చేసి వారినుంచి డబ్బుగుంజుతున్నారు. ఇటువంటివారి రహస్యాలు బయటపెట్టడానికి భారత్ మాజిక్ సర్కిల్ పూనుకుంది.

ఏదో అనారోగ్యంతో వున్నవారిని, ఎవరో చేతబడి చేసారని భయపెట్టి మాజిక్కులు చేస్తున్నారీ మాంత్రికులు. ముఖ్యంగా వారిచేత ఒక మామూలు నిమ్మకాయను కోయించి, అందులో నిమ్మరసం బదులు రక్తం చూపించి, వారికెవరో చేతబడి చేశారని చెప్తారు. ఎటువంటి వారైనా నిమ్మకాయలో రక్తం కనబడగానే కంగారు పడతారు. తరువాత వారినుంచి డబ్బుగుంజి, ఏదో మంత్రాలు చదివినట్లు నటించి, మళ్ళీ నిమ్మకాయను కోయించగానే అందులో మామూలుగా నిమ్మరసం వుంటుంది. కాబట్టి వారిపై ప్రయోగించిన చేతబడి తీసేసానంటాడు మాంత్రికుడు.

అతను ప్రయోగించినది మాజిక్ అని చాలామందికి తెలియదు. ముందుకోసిన నిమ్మకాయలోకి ఎర్రసిరాను ఇంజక్షను యిచ్చే సిరంజితో యెక్కించి తరవాతకోస్తే రక్తంలా కనపడుతుంది. లేక కోయబోయే కత్తికి ముద్దమందారం పువ్వులను రుద్ది, ఆరిన తరువాత నిమ్మకాయనుకోస్తే రసాయనిక చర్యవలన నిమ్మరసం ఎర్రగా మారుతుంది. ఇలాంటివాళ్ళు మీ చుట్టుపక్కల కూడా వుంటారు జాగ్రత్త పడండి.

బుర్రా సుబ్రహ్మణ్యం

తన నిరీక్షణంతా యేవొక వ్యక్తి జ్ఞాపకాలతో పెనవేసుకు పోయిందో, వాటినుంచి తప్పించుకోలేని తనకి ఆవేదనే మిగిలింది. తన అస్తిత్వాన్ని కదిలించిన, తను తొలిసారిగా స్పందించిన అనుభవంతాలూకు అనుభూతిమాత్రం అశాంతి జ్ఞాపకంలా మిగిలింది. అది మళ్ళీ అనుభవం కావాలనుకోవడం, అవుతుందనుకోవడం వెర్రి. ఏదైనా అయిపోతూ వుంటుంది. కానీ ఆగిపోదు. వెనక్కి మళ్ళీ రాదు- శూన్యంగా వుంది మెదడు. హృదయం వున్నట్లుండి శిఖరంమీంచి లోయలోకి పడుతున్న భార రాహిత్య స్థితితో శరీరం బెండుముక్కలాఐ యింకాయింకా తేలికై యేమీ లేకుండా, యేమీ కాకుండా వున్నట్లుండి గుండె లోతుల్లోంచి దుఃఖం తన్నుకొచ్చి నిలువెల్లా హాశికిపోయి మంచంమీదపడి వెక్కి వెక్కి యేడ్వటం మొదలుపెట్టింది.

* * *

ఉదయం అవుతూవుంది. తల బరువుగా అనిపించి లేచింది భారతి. లైటు యింకా వెలుగుతూనేవుంది. తీసేసింది. సహజమైన వుదయపు వెల్తురు అమాయకంగా పల్చగా స్వచ్ఛంగా గదినంతా ఆవరించుకొంటోంది. బుగ్గలమీద కన్నీటి చారికలు చేతికి తగిలి మొహాన్ని చేతులతో తుడుచుకుంది. దుస్తులు వేసుకుని కొంతసేపు కిటికీ వద్ద నుంచుని వుదయాన్ని చూస్తూండిపోయింది. యేదో మంచుతెరలా చల్లగా హృదయాన్ని తాకుతూ ఏదో ప్రశాంతత, నిర్లిప్తతతో కూడిన ప్రశాంతత—శూన్యంలో ప్రశాంతత.

కాలకృత్యాలు తీర్చుకుంది. గదినుండి యింకా వాళ్ళు వెలుపలికి రాలేదు. యింకా నిద్రపోతున్నట్లున్నారు. సూట్కేసు సర్దుకుంది. అప్పుడేవొచ్చిన పనిమనిషికి పనులు పురమాయించింది. మళ్ళీ కొంతసేపు వరండాలో కుర్చీమీద కాఫీ తాగుతూ జనసంచారాన్ని గమనిస్తూ కూచుంది. మనుషులు—హడావిడిగా మనుషులు. నెమ్మదిగా మనుషులు. కార్లూ — సైకిళ్ళూ — ఎద్దుబండ్లూ— మనుషుల ప్రవాహం—తనకి అంతే ట్రాన్స్‌పరెన్ట్‌గా కనిపిస్తుంది. వాళ్ళ స్వభావాలూ ప్రవర్తనలూ అందుకి కారణాలూ పరిస్థితులూ, వాళ్ళ ఆంతర్యాలూ— అందుకే తనకెప్పుడో తప్ప ఎప్పుడూ కోపం రాదు. అసహ్యంకన్నా ఎక్కువ జాలి కలుగుతుంది వాళ్ళని చూస్తే— నళినిని తను క్షమించింది, తన వినీల కోసంకాదు, తన కోసమే తను నళినిని క్షమించింది- ద్వేషించటం తన స్వభావంలో లేదు— తను దూరంగా వెళ్ళిపోతోంది వీళ్ళనుంచి-తనకు తాను దగ్గిర కావటానికి తనుగా జీవించటానికి, తనను తాను పొందటానికి— యిక తనకేం బంధాలూ లేవు. బాధ్యతలూ లేవు- అగాధ శూన్య నీలిమత్వంలో మినుకుమనే తారలా తను ఒంటరిగానే మిగిలిపోయినా తను తనుగా మిగిలిపోయింది అంతే చాలు- తనకి యెవ్వరూ దక్కకపోయినా తను తనకి దక్కింది అంతేచాలు— తేలిగ్గా నిట్టూర్చి సుతారంగా వొళ్ళు విరుచుకుని లోపలి గదివేపు చూసింది. తలుపులు యింకా మూసేసే వున్నాయి. నిర్ణయానికొచ్చినట్లు తల పంకించి గబగబా వొక ఉత్తరం రాసి రేడియోవొద్ద పెట్టింది. లేచిందే రేడియోని పలకరిస్తుంది వినీల— తప్పక చూస్తుంది. తను వాళ్ళు లేవకముందే వెళ్ళిపోవటం మంచిది—బతిమాలుకోవటాలూ నిరాకరించటాలూ—సంజాయిషీలూ- యీ దృశ్యమంతా తను భరించలేదు— ముఖ్యం నళిని చూపుల్ని—వినీల తనను అర్థం చేసుకుంటుంది—పాపం అమ్మకి విశ్రాంతి కావాలి కాబోలు, అందుకే వెళ్ళింది అనుకుంటుంది—అంతే—సరిపెట్టుకుంటుంది—అలవాటు పడిపోతుంది.

సూట్కేసు పట్టుకుని లోపలికి నడిచి అంట్లుతోముతున్న పనిమనిషివంక వొకసారి చూసి యేదో చెప్పాలనుకుని పెదవులు కదల్చి మళ్ళీ విరమించుకుని వీధిలోకి నడిచింది భారతి. నిర్లిప్త శూన్యంగా తేలిగ్గా వుంది హృదయం— అవును- తనలోనే వుంది ప్రపంచం— ఆ ప్రపంచంలోకి—— వూపిరి గుండెలనిండా పీల్చి వొదిలి నడుస్తూ——

